# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 30-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:116 పేజీలు:6 వెల: రూ.1/-





# మౌన భాష శక్తిని పరిచయం చేసిన మహర్షి రమణ భగవాన్

## (30 డిసెంబర్ "రమణ మహర్షి జయంతి" సందర్భంగా)

భారతదేశం ఆధ్యాత్మికంగా ప్రపంచానికే తలమానికం. మన మహర్షులు సూక్ష్మంగా, స్థూలంగా జన్మరాహిత్యాన్ని పొందే ముక్తి మార్గాన్ని చూపే దీప స్థంభాలవంటి వారు. కొందరు పూర్వజన్మలా పుణ్య ఫలంతో సాక్షాత్తు భగవంతుడినే గురువుగా ఆరాధిస్తూ, ప్రజలకు తమ జీవనాన్నే ఉదాహరణగా చూపిన వారిలో శ్రీ రమణ భగవాన్ మహర్షి ప్రథములు. ఏ గురు సుశృష లేకుండా, శ్రీ అరుణాచలేశ్వరున్నే తండ్రి, గురువుగా, తమ జీవితమే తపస్సుగా మార్చుకున్న బు?షి రమణ భగవాన్. దేహానికి చావు ఉంటుందని, దేహాతీతమైన ఆత్మకు, ఆ ఆత్మకు చావు లేదని నమ్మారు. ఆలయంలో శివ దర్శనం తర్వాత శరీరంపై వస్త్రాలు, వస్తువులు విసర్జించి, ఆలయ వెనుక భాగంలో తపస్సు చేశారు. జుట్టు అట్టలు కట్టి, తొడలు పురుగులు కీటకాలు కొరికివేయడంతో రక్తం గడ్డకట్టేసినా స్వామికి ఏమీ తెలిసేది కాదు. తర్వాత అరుణాచలం కొండపైకి బస మార్చారు. 1899లో విరూపాక్ష గుహకి మారాం మార్చారు. వారి మౌనోపదేశమే భక్తులకు ప్రయోజనకారం అయ్యింది. భక్తుల విన్నపం మేరకు ఐదు స్తోత్రాలు గానం చేశారు.

### రమణ మహర్షిగా మారిన వెంకటరామన్ అయ్యర్:

30 డిసెంబర్ 1879 రోజు తమిళనాడులోని విరోధ నగర్ జిల్లా, తిరుచులి గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో అళగమ్మళ్–సుందరం అయ్యర్ అనే పుణ్య దంపతులకు జన్మించిన వెంకటరామన్ అయ్యర్, తదుపరి భగవాన్ రమణ మహర్షిగా భక్తుల గుండెల్లో శాశ్వత ముద్ర వేశారు. తన కుటుంబంలోనే అతి సమీప బంధువు సన్యాసం స్వీకరించారు. వెంకటరామన్ అయ్యర్‌కు ఏడవ సంవత్సరంలోనే ఉపనయనం జరిగింది. ఏకసంథాగ్రాహి అయిన వెంకటరామన్‌కు మంచి జ్ఞాపకశక్తి, దేహదారుఢ్యం కలిగి ఉండేది. నిద్రలో తోటి పిల్లలు బాదినాఆయనకు తెలిపేది కాదు. తన 12వ ఏటనే ధ్యానంలో గాఢ స్థితికి చేరుకునే వారు. 11వ ఏట చదువు నిమిత్తం దిండిగల్‌లో ఉన్న తన చిన్నాన్న సుబ్బయ్యర్ దగ్గర గడపడం, తిరుచ్ఛుళ్ పాఠశాలలో తమిళంలో బోధన, దిండిగల్‌లో ఒక ఏడాది ఆంగ్లంలో బోధించే హిందూ పాఠశాల, అనంతరం బాబాయి బదిలీతో మదురైకి మకాం మార్చారు. స్కాట్ మిడిల్ స్కూల్, అమెరికన్ మిషన్ హైస్కూల్లో చదివిన వెంకటరామన్ అరుణాచలం అనే పవిత్ర క్షేత్రం ఉందని తెలుసుకున్నారు. అల్లమ ప్రభు ప్రభావంతో ఆధ్యాత్మిక మార్పును పొందడం ప్రారంభం అయ్యింది. ఆత్మ సాక్షాత్కారం గురించి పూర్తిగా తెలుసుకొని, 63 మంది నాయనార్ల జీవిత చరిత్రలు చదివి భగవంతుడిలో లీనం కావడం సుసాధ్యమని నమ్మారు.

### మౌనవ్రతమే భగవంతుని దర్శనానికి సరళ మార్గం:

1896లో మరణ భయం కలగడంతో తనను తాను శోధించడం ప్రారంభించడంతో ఆయన జీవితం మరో కోణంలోకి మారిపోయింది. 16 ఏండ్ల వయస్సులో మోక్షజ్ఞానం పొంది తరువణ్ణామలై సమీప 1995 నుంచి అరుణాచల పర్వతాల వైపు వెళ్ళి అక్కడే స్థిరపడడం జరిగింది. నాటి నుంచి భక్తులు ఆయనను రమణ మహర్షిగా పిలవడం మొదలైయ్యింది. 'నేను ఎవరు ?' అనే ఆత్మశోధన మార్గాన్ని బోధించారు. మౌళ వ్రతమే భగవంతుని దర్శనానికి సరళ మార్గమని బోధించారు. మౌనాన్ని మించిన సాధన లేదని ప్రచారం చేసిన రమణ మహర్షి మనసును అదుపులో పెట్టుకునే జ్ఞాన, భక్తి, కర్మ మార్గాలను బోధించారు. భక్తి మార్గం సులభమైనదని, ఇష్ట దైవాన్ని ధ్యానించడంతో మనసు వేగం తగ్గి అదుపులోకి వస్తుందని బోధించారు. అరుదైన వ్యక్తిత్వం కలిగిన రమణ మహర్షిలో హడావుడి, ఆందోళన కనుపించేది కాదు. మౌనం, నిశ్చలత తనను ఆకట్టుకున్నాయని తెలిపే వారు. మధుర స్వభావులు, ప్రేమాస్పదులు అయిన మహా జ్ఞాని రమణ మహర్షి దయతో దాపరికం లేకుండా మాట్లాడే వారు.

'మౌనం' అత్యంత శక్తివంతమైన సాధనమని నమ్మి తక్కువగా మాట్లాడే వారు. స్వీయ శోధన ఉత్తమమని, దీనితో మోక్షం సులభంగా సాధ్యపడుతుందని బోధించారు. అద్వైతం, జ్ఞానయోగాలతో ముడిపడి ఉన్నా కూడా అడిగిన వారి మనస్థితిని బట్టి భక్తి మార్గాన్ని కూడా వివరించే వారు. 14 ఏప్రిల్ 1950 రోజు తుది శ్వాస విడిచిన రమణ మహర్షి నివసించిన ప్రదేశమే నేడు రమణ ఆశ్రమంగా పేరు కాంచింది.

– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వందేమాతరం స్ఫూర్తితో వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి- కిషన్ రెడ్డి




న్యూఢిల్లీ, డిసెంబర్ 29:వందేమాతరం అనేది కేవలం ఒక గీతం కాదని, అది భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిన త్యాగస్ఫూర్తి, దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి అన్నారు.

వందేమాతరం 150 ఏళ్ల సందర్భాన్ని గుర్తుచేసే అరుదైన చిత్రాలతో పాటు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ సంకల్పాన్ని తెలియజేసేలా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కోఠిలోని వివేక వర్ధిని విద్యాసంస్థలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఛాయాచిత్ర ప్రదర్శనను కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

వీవీ కళాశాలలో నిర్వహించిన వందేమాతరం కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగిస్తూ, వందేమాతరం నినాదం భారతీయుల ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్యోద్యమంలో వారి తపన- త్యాగాలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. సుమారు 150 సంవత్సరాల క్రితం మహాకవి బంకిం చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం భారతమాత ఔన్నత్యం, ఆధ్యాత్మిక వైభవం, సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

బ్రిటిష్ పాలకుల "విభజించి పాలించు" విధానానికి వ్యతిరేకంగా దేశ ప్రజలను ఏకం చేసిన శక్తి వందేమాతరమేనని, కులం, మతం, ప్రాంత భేదాలు మరిచి "దేశమే ప్రథమం" అన్న భావనను పెంపొందించిందని మంత్రి అన్నారు.

1905 బెంగాల్ విభజన ఉద్యమం నుంచి 1942 క్విట్ ఇండియా ఉద్యమం వరకు ప్రతి స్వాతంత్ర్య పోరాటంలోనూ వందేమాతరం నినాదం మార్మోగిందని గుర్తు చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత హైదరాబాద్ గడ్డపై త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడేలా చేసిన సర్దార్ వల్లభ భాయ్ పటేల్ కి మనం ఎప్పటికీ రుణ పడి ఉంటాం. 1938లో నాటి హైదరాబాద్ సంస్థానంలో ప్రారంభమైన వందేమాతర ఉద్యమాన్ని నిజాం ప్రభుత్వం నిషేధించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వందేమాతరం గీతాన్ని ఆలపించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకున్నారని, ఆ ఉద్యమంలో అనేక మంది విద్యార్థులు, మేధావులు త్యాగాలు చేశారని మంత్రి అన్నారు.

వందేమాతరం నినాదంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా వివిధ సామాజిక, జాతీయ సంస్థలు రాజకీయ భేదాలను పక్కనపెట్టి ఐక్యపోరాటం చేసిన చరిత్ర హైదరాబాద్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశ పునర్నిర్మాణంలో, వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని మంత్రి పిలుపు నిచ్చారు. శ్రీమతి శృతి పాటిల్, అదనపు డైరెక్టర్ జనరల్, సీబీసీ, పీఐబీ, తన ప్రారంభ ప్రసంగంలో వందే మాతరం శాశ్వత శక్తి, భారత జాతీయ గుర్తింపును తీర్చిదిద్దడంలో దాని కీలక పాత్రను ప్రస్తావించారు. ఈ పదాల ఆత్మ చరిత్ర పుటలను మించి విస్తరించి, తరతరాలుగా ప్రజలను ప్రేరేపిస్తూ దేశవ్యాప్తంగా లోతైన దేశభక్తి భావాన్ని పెంపొందించిందని ఆమె పేర్కొన్నారు. పార్లమెంటులో ఇటీవల గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని ఉటంకిస్తూ, భారత్ సహనశక్తి, అంతర్గత బలాన్ని ఆమె పునరుద్ఘాటించారు. ప్రతి సవాలును అధిగమించే దేశ సామర్థ్యాన్ని ప్రతిబింబించేదే వందే మాతర సారమని ఆమె వ్యాఖ్యానించారు.

వందే మాతరం ప్రయాణానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఆమె తెలిపారు. ఈ ప్రయత్నం వందే మాతర అసాధారణ వారసత్వాన్ని ప్రదర్శించడమే కాక, జాతీయవాదాన్ని పునరుద్ధీపింపజేయడం, పౌరులు భారతదేశంతో భావోద్వేగపరంగా, సాంస్కృతికంగా మళ్లీ అనుసంధానమయ్యేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదని ఆమె అన్నారు.

వందేమాతరం 150 ఏళ్ల సందర్భాన్ని గుర్తుచేసే అరుదైన చిత్రాలతో పాటు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ సంకల్పాన్ని తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ప్రదర్శన డిసెంబర్ 31 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. సందర్శకుల కోసం ఇంటరాక్టివ్ స్పాట్ ఆన్‌లైన్ క్విజ్‌ను ఏర్పాటు చేసి, అర్హత సాధించిన వారికి వెంటనే సర్టిఫికేట్‌ను ఇమెయిల్, మొబైల్ లేదా క్యూఆర్ ( ఖీఖ) ద్వారా అందించే సౌకర్యం కల్పించారు. యువతను ఆకర్షించేందుకు డిజిటల్ సెల్ఫీ కియోస్క్, సెల్ఫీ పాయింట్ లను ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ రాకేష్ జైస్వాల్, కార్పొరేటర్, జాంబాఘ్ డివిజన్, శ్రీ నాగేశ్ వి. రావు, జాయింట్ సెక్రటరీ, వీవీఈఎస్, శ్రీ డా. డి. విద్యాధర్, ప్రిన్సిపాల్, వి.వి. కాలేజ్,సిబిసి, పిఐబి అధికారులు, వీవీఈఎస్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పూర్తి చేయడం కేసీఆర్ నిబద్ధత..

**-70 ఏళ్ల నుంచి వింటున్న పోలవరం ఇంకా పూర్తి కాలేదు**

**-నీళ్ల సబ్జెక్ట్ నాలుగు రోజులు చదివితే రాదురాష్ట్రం పైన ప్రేమ ఉండాలి!**

**-శాసన సభలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్**

హైదరాబాద్, డిసెంబర్ 29: పోలవరం ప్రాజెక్టు కోసం 70 ఏళ్లుగా వింటున్నామని, ఇంత వరకూ పూర్తి కాలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ హయాంలో పూర్తయిందని, ఇదే ఆయన నిబద్ధత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. కేటీఆర్ ప్రసంగం ఇలా సాగింది.

ఎవరు ప్రాజెక్టులు కట్టినా తాగునీటి అవసరాల పేరుతోనే ప్రాజెక్టులు కట్టడం ప్రారంభిస్తారు. ఆ తర్వాత అన్ని అనుమతులు తీసుకురావడం అనవాయితీ, కానీ ఈ విషయాన్ని ఎవరు చెప్పరు.

పోలవరం ప్రాజెక్టు కోసం 70 ఏళ్లు నుంచి వింటున్నా కానీ పూర్తి కాలేదు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం కేసీఆర్ హయాంలో పూర్తి చేశారు. ఇది కేసీఆర్ నిబద్ధత. కాలంతో పోటీ పడి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశారు. కాళేశ్వరంలో రంధ్రాన్వేషణ చేస్తే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. రాజకీయ పరంగా మాకు నష్టం రాదు.

ప్రజలకు తెలులసు నీళ్ల ఇచ్చింది ఏవరో.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఒప్పుకుంటే నష్టం చేసినట్టే, 299 టీఎంసీ(299 ఀఓఅ)లు ఒప్పుకుంది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే, దాని పైననే మా ప్రభుత్వం మరిన్ని కేటాయింపుల కోసం అడిగినం, పాలమూరు ప్రాజెక్టును సీఎం రేవంత్ కావాలనే పండపెట్టిండు, ప్రాజెక్టు కడితే కేసీఆర్‌కు పేరు వస్తుంది? ఆయన పాత బాస్ చంద్రబాబుకు కోపం వస్తుంది.. కృష్ణ నది నుంచి నీళ్లు తీసుకుంటే బాబుకు కోపం వస్తుంది. అందుకే ప్రాజెక్టును పండబెట్టి.. కాలువలు కూడా తర్వడం లేదు. రేవంత్ అవినీతి అక్రమాలు ఆపినందుకే రేవంత్ బూతులు మాట్లాడుతున్నారు.

నన్ను అంటే ఏమాత్రం రేస్పాండ్ కాను.. కాని మా నాన్నను అంటే ఊర్కోనేది లేదు. నీళ్ల గురించి అడిగితే నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్ కే అల్లాడుతున్నారు. అట్లాంటిది కేసీఆర్ ను అసెంబ్లీకి రమ్మని డిమాండ్ చేస్తున్నారు. నీళ్ల సబ్జెక్ట్ నాలుగు రోజులు సదివితే రాదు రాష్ట్రం పైన ప్రేమ ఉండాలి

పంచాయతీలలో మా పార్టీ గొప్ప రిజల్ట్ వచ్చాయి. రెండేళ్లల్లోనే కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకత ఎదుర్కొంది. సీఎం చెప్పిన జాబితాలోనే ఇతర పార్టీల సర్పంచ్ లను కలుపుకున్నారు.

# సింగరేణిలో మారుపేర్ల బాధితుల సమస్యలు పరిష్కరించాలి

**సింగరేణిలో మారుపేర్ల బాధితుల సమస్యలు పరిష్కరించాలి**

**అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గళం**



హైదరాబాద్, డిసెంబర్ 29:గత కొన్ని సంవత్సరాలుగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వ్యాప్తంగా మారుపేర్ల బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించారు. సింగరేణి వ్యాప్తంగా వందలాది మంది కార్మికుల పిల్లలు మారుపేర్లు, విజిలెన్స్ విచారణల పేరుతో ఉద్యోగాలు రాక తీవ్ర మానసిక, ఆర్థిక ఒత్తిడులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు దూరమవడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ సమస్యను మొదటి నుంచే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, దీనిపై స్పష్టమైన పరిష్కారం దిశ గా ప్రయత్నాలు కొనసాగు తున్నా యని అన్నారు. అయినప్ప టికీ బాధితులకు న్యాయం జర గడం లో ఆలస్యం జరుగుతుండటం ఆందోళనకరమని ఎమ్మెల్యే పే ర్కొన్నారు. వీలైనంత త్వరగా మా రుపేర్ల బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన లో ఈ అంశంపై సత్వర నిర్ణ యాలు తీసుకునేలా తన వంతు పూర్తి కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తూనే ఉంటానని తెలిపారు.

# గట్టు పంచాయితీ.. రైతు బలి

పెద్దపల్లి, డిసెంబర్ 29:భూవివాదంలో చోటు చేసుకున్న గట్టు పంచాయితీ ఒక రైతు ప్రాణాన్నే బలిగొంది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో భూవివి పంచాయతీలో ఇద్దరు రైతులు గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఓ రైతు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు

పోలీసుల కథనం ప్రకారం.. కనగర్తికి చెందిన ఆది రాజయ్య (తండ్రి మల్లయ్య) అదే గ్రామానికి చెందిన ఆది రాజయ్య (తండ్రి ఐలయ్య)లకు చెందిన వ్యవసాయ భూమి వద్ద గట్టు పంచాయతీ నడుస్తోంది. భూ తగాదాలు కొనసాగుతున్న క్రమంలో తాజాగా ఇవాళ ఉదయం పొలం వద్దనే ఇరువురు రైతులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఒకనొకరు బలంగా తోసుకోవడంతో ఆది రాజయ్య (తండ్రి మల్లయ్య) పొలంలో కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

# ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం..

**–జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్**

అమరావతి, డిసెంబర్ 29:జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ



సునీల్ షొరాణే ప్రజల నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధి లో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో పనిచేశాను. నాకు ఇంత వరకు జీతం ఇవ్వకపోగా కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య అనుచితంగా అమర్యాదగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.నాకు న్యాయం చేయండని పి.మల్లికార్జునయ్య జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.నేను ఏఎన్ఎంగా పనిచేయుచున్నాను. నాకు బాలుగ్రం అనే వ్యక్తిగా 2019లో వివాహం జరిగింది. నాతో వివిధ ప్రవేట్ బ్యాంకులలో 30 లక్షలకు పైగా లోన్లు తీసుకుని నాతో సంతకాలు పెట్టించి నా జీతం నుండి ప్రతినెలా 28 వెల రూపాయలు ఈఎంఐ కట్టేలా చేసి.. వేరే అమ్మాయిలతో తిరుగుతూ నన్ను మోసం చేస్తున్నాడు. ఆ డబ్బులు నన్ను కట్టమని శారీరకంగా మానసికంగా ప్రతిరోజు నన్ను వేధిస్తున్నాడు. నాకు న్యాయం చేయండని ఓ బాధితురాలు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

**-ద్వారకా తిరుమలలోని ఉత్తర ద్వారదర్శన ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ**



ఏలూరు, డిసెంబర్ 29: ము క్కోటి ఏకాదశి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో ఉత్తర ద్వార దర్శనమునకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కే వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీకె.ప్రతాప్ శివ కిషోర్, ఆలయ పరిసరాలను, క్యూలైన్లను, బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఉత్తర ద్వార దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని నియంత్రించడానికి మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ మాఢ వీధులు, ప్రవేశ ద్వారాల వద్ద భారీ బందోబస్తును ఎస్పీ సమీక్షించారు. రెవెన్యూ, పోలీస్, దేవాలయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి భక్తులకు తాగునీరు, ప్రసాదం మరియు ఇతర కనీస సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటు రాకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రానికి వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన పార్కింగ్ స్థలాలను, అదనపు సిబ్బందిని కేటాయించాలని సూచించారు.ట్రైనింగ్ ఐపీఎస్ అధికారి జయశర్మ, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు ఇన్‌స్పెక్టర్ శ్రీ యు.జె.విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్, ఆలయ ఈఓ, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కందం- నేటికి అందం

సేవల నిడుటను విధిగా
లావుగ భావించి సబ్మెరైన్లో వెడలన్
కావలసిన ధైర్యమ్మును
దేవత లిడినారు ద్రౌపదీ ముర్మునకున్ !!

(తన వయస్సును,హోదాను కూడా పక్కన బెట్టి రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము సాధారణ నౌకాధికారి గా సబ్ మెరైన్ లో సముద్రంలోనికి ప్రవేశించి , కార్యకలాపాలు పరిశీలించి నౌకాదళానికి ఉత్సాహం కలిగించడం సంతోషకరంగా దేశం భావిస్తూ ఆమెకు జేజేలు పలుకు తున్నది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

చురక

ఉద్యమాలు సాధించిన
ఉపాధి హామీ హక్కు
సంహరించి దాన్ని నేడు
స్కెల్టన్ లా చేసే ముప్పు
ప్రభుత్వం తీరుపైన
ప్రతిపక్షాలైక్య పోరు
ప్రబలంగా చేస్తే తప్ప
పరిరక్షణ చేయలేరు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 30-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:116 పేజీలు:6 వెల: రూ.1/-


## దివంగత నేత ఆర్.దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డిలకు సభ సంతాపం



హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది.మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు?

### -ప్రశ్నించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఇరిగేషన్‌లో తానే మాస్టర్ అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అనుకుంటున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హరీష్ రావు దిగజారుడు మాటలు మాటాడుతున్నారని అన్నారు. హరీష్ రావు పై ఉత్తమ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు.. హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు? అని.. ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలు బయటపెడతామని, పాత జీవో కాపీలను మీడియాకు చూపెడతామని తెలియజేశారు. కృష్ణా జలాల్లో తాము 90టిఎంసిలు డిమాండ్ చేశామని, తాము 45 టిఎంసిలు అడిగామని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీదే బిఆర్ఎస్ బతుకుతోందని, తెలంగాణకు అన్యాయం జరిగేలా తాను ఎందుకు లేఖ రాస్తానని ఉత్తమ్ ప్రశ్నించారు. సిడబ్ల్యూసికి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని, కృష్ణా బేసిన్ పై అసెంబ్లీ ప్రజెంటేషన్ కు తాము సిద్ధమని సవాల్ విసిరారు. మేడిగడ్డ మరమ్మతులపై ఎల్అండ్ టికి నోటీసులిచ్చామని, మేడిగడ్డలో పలు పరీక్షలు, ఇతర తనిఖీలకు ఎల్అండ్ టి ఒప్పుకుందని పేర్కొన్నారు. త్వరలోనే మేడిగడ్డ పనులు మొదలవుతాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



## ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం...

### - ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ




హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విద్య రంగ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ పిలుపు నిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్-సికింద్రాబాద్ జిల్లా, అమీర్ పేట్ శాఖ ఆధ్వర్యంలో పడాల రామారెడ్డి లా కాలేజీలో 44వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతర ఉద్యమాలతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తుతున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని అన్నారు.జనవరి 3,4,5 తేదీల లో శంషాబాద్ లో రాష్ట్ర మహాసభలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మహాసభల్లో దాదాపు 800మంది విద్యార్థి నాయకులు, ప్రొఫెసర్లు, ప్రముఖులు, రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థి నాయకులు హాజరవుతారని తెలిపారు. విద్యారంగ సమస్యలపైన, విద్యారంగస్థితి, రాష్ట్ర సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, డ్రగ్స్ మహమ్మారి నిర్మూలన తదిత అంశాలపై తీర్మాణాలు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని విద్యార్థి నాయకులు మహాసభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మహానగర్ లా ఫోరమ్ కో కన్వీనర్ మిద్దెల గౌతమ్ రెడ్డి, జిల్లా కలమంచ్ కన్వీనర్ దిలీప్, శివరాజ్ ,పడాల రామా రెడ్డి లా కాలేజీ కార్యదర్శి రామ చేతన్ , మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మ జాతర లో దుకాణాల ఏర్పాటుకు వేలంపాట

హైదరాబాద్, డిసెంబర్ 29: 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరుగు సమ్మక్కబి సారలమ్మ జాతర కార్యక్రమంలో భాగంగా టెంకాయలు, బెల్లం, లడ్డు పులిహోర ప్రసాదం, పుట్నా లు, పేలాలు అమ్ముకునేందుకు, తలనీలాలు పోగు చేసుకునేం దుకు, తల్లి ఆరాధన (కోళ్లు) అమ్ముకునేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు ఈవో శంకరయ్య తెలిపారు.

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల మానేటి రంగనాయక స్వామి ఆలయ ఆవరణలో సోమవారం తలనీలా లు పోగు చేసుకునేందుకు రూ. 82 వేలు, కొబ్బరికాయలు, బెల్లం అమ్ముకునేందుకు రూ.1 లక్ష80 వేల 999, తల్లి ఆరాధన అమ్మకం హక్కు రూ.లక్ష 80 వేల 333, కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు రూ.71 వేలు బహిరంగ వేలంపాటను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవో శంకరయ్య మాట్లాడుతూ 2026 జనవరి 28 నుంచి 31 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంపెల్లి సతీష్, మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్, ఉప సర్పంచ్ సతీష్, గ్రామస్తులు రమేష్, సంపత్ తోపాటు పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం..

హైదరాబాద్, డిసెంబర్ 29:తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఇవాళ(సోమవారం) ప్రారంభమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అన్నీ పార్టీల ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సైతం అసెంబ్లీకి వచ్చారు. అయితే, కేసీఆర్ తిరిగి వెళ్లిపోయారు.

## మావోయిస్టులకు మరో బిగ్ షాక్.. రిమాండ్ పొడిగింపు..

అమరావతి, డిసెంబర్ 29:మావోయిస్టులకు మరో బిగ్ షాక్ తగిలింది. వటమట, పెనమలూరు పోలీసులకు చిక్కిన మావోయిస్టు నిందితుల రిమాండ్ ఈ రోజు(సోమవారం) ముగియాల్సి ఉంది. అయితే, మావోయిస్టులను మరింత సమగ్రంగా విచారించాలని పోలీసులు భావించారు. ఈక్రమంలో మావోల రిమాండ్ పొడిగింపు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ఎదుట హాజరు పరిచారు పోలీసు అధికారులు.

ఈ నేపథ్యంలో మావోయిస్టులకు 12వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు న్యాయాధికారి. ప్రస్తుతం నెల్లూరులోని కేంద్ర కారాగారంలో, రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీలుగా మావోయిస్టులు ఉన్నారు. వీరిని రిమాండ్‌లోకి తీసుకుని సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసులు అనుకున్నారు. మావోయిస్టులను విచారిస్తే మరికొన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

## ఎర్నాకుళం రైలు ప్రమాదం...

అనకాపల్లి, డిసెంబర్ 29: టాటా నగర్ నుంచి ఎర్నాకుళం వెళ్తున్న టాటా- ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ప్రమాద వివరాలను మీడియాకు తెలియజేశారు. కంపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. నర్సింగబల్లి వద్ద బీ1 ఏసీ బోగికి బ్రేక్‌లు పట్టేయడంతో మంటలు చెలరేగాయని అన్నారు. మంటలను చూసిన వెంటనే ఓ వ్యక్తి చెయిన్ లాగడంతో రైలు ఆగిందని తెలిపారు.

ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు చెప్పారు. ఒక కంపార్ట్మెంట్‌లో 82 మంది ప్రయాణికులు ఉండగా, మరో కంపార్ట్మెంట్‌లో 76 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు.

## రైలు ప్రమాదం.. 13 మంది దుర్మరణం

### -మెక్సికోలో దుర్ఘటన
### -98 మందికి గాయాలు
### -నిజాండాలో పట్టాలు తప్పిన రైలు

వెబ్ డెస్క్, డిసెంబర్ 29: మెక్సికోలో రైలు పట్టాలు తప్పిన దుర్ఘటనలో 13 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 98 మందికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో రైలులో 250 మంది ప్రయాణికులు ఉన్నారు. సుమారు 250 మంది ప్రయాణికులు, 9 మంది సిబ్బందితో ఈ రోజు (మెక్సికోలో ఆదివారం) బయల్దేరిన ఇంటర్‌ఓషియానిక్ ప్యాసింజర్ ఒక్సాకాలో నిజాండా వద్ద పట్టాలు తప్పింది. రైలు పట్టాలు తప్పిందని సమాచారం అందుకున్న మెక్సికన్ ఆర్మీ, సివిల్ ప్రొటెక్షన్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న ప్రయాణికులను వెలికితీశారు. వారిలో 139 మంది సురక్షితంగా బయటపడ్డారని, 98 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.



రైలు ప్రమాదంపై మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షిన్బామ్ పార్డో విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సహాయం చేసేందుకు ఉన్నతాధికారులను ఘటనాస్థలికి పంపించినట్లు పేర్కొన్నారు. రైలు ప్రమాదంపై ఒక్సాకా గవర్నర్ సాలోమన్ జారా క్రూజ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఫెడరల్ ఏజెన్సీలతో కలిసి సహాయక చర్యలు, వైద్య సేవలు సమన్వయం చేసుకుంటామని తెలిపారు. రైలు ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.




రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని మెక్సికో అటార్నీ జనరల్ ఎర్నేస్టినా గోడోయ్ రామోస్ తెలిపారు.

## మరో యువకుడి గొంతు కోసిన చైనా మాంజా..

హైదరాబాద్, డిసెంబర్ 29:చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో చైనా మాంజా ఆందోళన కలిగిస్తోంది. చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు. అయితే ఇది చాలా మంది ప్రాణాలు తీస్తోంది

ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక వ్యక్తి చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు తాజాగా మరో వ్యక్తి చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన జమీల్ అనే యువకుడు చార్మినార్ వైపు బైక్ వెళుతున్నాడు. శంషీర్ గంజ్ ప్రాంతంలో చైనా మాంజా అతడి గొంతుకు తగిలి కోసుకుపోయింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

## తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ

### -బిజెపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హాతో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



న్యూఢిల్లీ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హాని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాబోయే కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ సిన్హా తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, అవసరమైన కార్యాచరణ, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై విలువైన సూచనలు చేశారు. సమిష్టికృషితో మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా.. ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ....వచ్చే నెలలో భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నితిన్ నబిన్ తెలంగాణ పర్యటన జరగనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణలో పార్టీ బలోపేతానికి మరింత వేగం పుంజుకుంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న అనేక కీలక అంశాలు, ప్రజా సమస్యలపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ప్రజల దృష్టిని మళ్లించేలా కొత్త కొత్త అంశాలను కావాలనే తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే [illegible] ఆరోపించారు.ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాల్సిందేనని అన్నారు. అసెంబ్లీకి రావడం ఏదో గొప్ప విషయంలా చూపించడం సరికాదని పేర్కొన్నారు. కేసీఆర్ సభకు రావడంపై గబ్బర్ సింగ్ జైలు నుంచి పారిపోయి వచ్చినట్లుగా హైప్ సృష్టించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.బిజెపిలోని కొందరు “లీక్ వీరులు” వీక్ కాక తప్పదని, పార్టీ క్రమశిక్షణ, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని పేర్కొన్నారు .ఎన్నికల సంస్కరణల్లో భాగంగా సర్ ప్రక్రియ తెలంగాణలో కూడా అమలవ్వాల్సిందేనని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యాలకు సంబంధించిన అక్రమ ఓట్లు ఉన్నాయన్న విషయం వాస్తవమని పేర్కొన్నారు.

అలాంటి దొంగ ఓట్లను [illegible] తొలగించాల్సిందేనని, స్వచ్ఛమైన ఓటరు జాబితాల ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుందని అన్నారు.

## 14 ఏళ్ల తర్వాత కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్, డిసెంబర్ 29:సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో 2011లో చోటుచేసుకున్న దారుణ హత్యకేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది.

ఈ కేసులో నిందితుడు కరణ్ సింగ్ (అలియాస్ కమ్మ సింగ్)కి మరణశిక్ష విధించింది. మూడో అదనపు డిస్ట్రిక్ట్ జడ్జ్ మండా వెంకటేశ్వరరావు ఈ కేసులో తుది తీర్పు ఇచ్చారు.

మహిళను కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అక్రమ సంబంధం కారణంగా హత్య జరిగినట్లు విచారణలో తేలింది. అప్పటి సనత్‌నగర్ పోలీస్ కానిస్టేబుల్ కప్పరి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఈ దర్యాప్తు సమయంలో పటిష్టమైన ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలైంది.

నిందితుడికి మరణ శిక్ష విధించడంతో 14 ఏళ్ల తర్వాత బాధితురాలికి న్యాయం జరిగిందని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ తీర్పుతో మహిళలపై జరిగే హింస ఘటనలపై చట్టపరమైన దృఢమైన సందేశమని పోలీసులు వ్యాఖ్యానించారు.

# ఏపీ కొత్త జిల్లాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం



అమరావతి, డిసెంబర్ 29:ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్పులతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరగనుంది.

క్యాబినెట్ నిర్ణయాల మేరకు:

అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లా కేంద్రంగా మార్చడం.

రాజంపేటను కడప జిల్లాలో కలపడం.

రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో చేర్చడం.

గూడూరును తిరుపతి నుంచి నెల్లూరు జిల్లాలో కలపడం.కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు.

ఈ పునర్విభజనతో పరిపాలన మరింత సమర్థవంతమవుతుందని, ప్రజలకు సేవలు సమీపంగా అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దు మార్పులు త్వరలోనే అధికారిక ఉత్తర్వుల ద్వారా అమలులోకి వచ్చే అవకాశం ఉంది.

# సద్వినియోగం చేసుకోవాలి..

**-సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు**

**-కలెక్టర్ రాజాబాబు**

ఒంగోల, డిసెంబర్ 29: సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర.పి.రాజాబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( మీకోసం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ను ఆ రోజు ఆయన ప్రారంభించారు. ఈ రెవెన్యూ క్లినిక్‌లో ప్రత్యేకంగా ఐదు కౌంటర్లు ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియ మించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ' మీకోసం 'లో ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూకు సంబంధించినవి వస్తున్నాయని, అందువల్ల వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# ఐఎన్ఎస్ వాగ్‌షీర్ జలాంతర్గామిలో ప్రయాణించిన భారత రాష్ట్రపతి



న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఐఎన్ఎస్ వాగ్‌షీర్ జలాంతర్గామిలో ప్రయాణించిన భారత రాష్ట్రపతిపశ్చిమ సముద్ర తీరంలో ఐఎన్ఎస్ వాగ్‌షీర్ జలాంతర్గామిలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రయా ణించారు. ఈ పర్యటనలో నౌకా దళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి రాష్ట్రపతి వెంట ఉన్నారు. నేడు (డిసెంబర్ 28, 2025) కర్ణాటక లోని కార్వార్ నౌకాశ్రయం వద్ద ఆమె ఈ జలాంత ర్గామిలోకి ప్రవేశించారు. సుమారు రెండు గంటలకు పైగా సాగిన ఈ సముద్రయానంలో జలాంత ర్గామి సిబ్బందితో ముచ్చటించి, కార్యకలాపాలు, యుద్ధ విన్యాసాల ప్రదర్శనలను రాష్ట్రపతి స్వయంగా వీక్షించారు.

రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తర్వాత జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతి శ్రీ ద్రౌపది ముర్మునే.

దేశీయంగా తయారైన 'కల్వరి' తరగతి జలాంతర్గామిలో రాష్ట్రపతి ప్రయాణించడం ఇదే మొదటిసారి. సాయుధ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి మన సైన్యం క్షేత్రస్థాయిలో ఎలా పనిచేస్తున్నదీ స్వయంగా పరిశీలిస్తూ, వారితో నిరంతరం మమేకమవుతున్నా రనేందుకు ఈ ప్రయాణం ఒక నిదర్శనం. అంతకుముందు నవంబర్ 2024లో స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో భారత నౌకాదళం నిర్వహించిన యుద్ధ విన్యాసాలను రాష్ట్రపతి స్వయంగా వీక్షించారు.

అనంతరం సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి తన భావాలను వ్యక్తం చేశారు.

"ఐఎన్ఎస్ వాగ్‌షీర్‌లో మన నౌకాదళ అధికారులు, నావికులతో ప్రయా ణించడం, నీటిలోపల గడపడం నాకు నిజంగా చాలా ప్రత్యేకమైన అనుభవం. ఐఎన్ఎస్ వాగ్‌షీర్ ద్వారా నిర్వహించిన అనేక ప్రయోగాత్మక కాల్పులు, సవాలుతో కూడిన కార్యకలాపాలు "వీరత వర్చస్వ విజయ" అన్నట్లుగా సిబ్బంది చూపిన అసాధారణ సంసిద్ధత, అంకితభావాన్ని చాటిచెబుతున్నాయి. వాగ్‌షీర్ సిబ్బంది క్రమశిక్షణ, విశ్వాసం, ఉత్సాహాన్ని ప్రత్యక్షంగా చూస్తుంటే.. మన జలాంతర్గాములు, భారత నౌకాదళం ఎలాంటి ముప్పునైనా ఎదుర్కోవడానికి, అన్ని పరిస్థితుల్లోనూ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయని నాకు అర్థమైంది" అని పేర్కొన్నారు.

# విద్యతోనే పేదరిక నిర్మూలన

**-చదువులో మర్మం గ్రహిస్తే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణులవుతారు**

**-టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి**

**-అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

అమరావతి, డిసెంబర్ 29: చదువులో మర్మం గ్రహించే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణులవుతారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం చల్లపల్లిలోని చంద్ర



రాజేశ్వరరావు వికాస కేంద్రంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతూ త్వరలో పబ్లిక్ పరీక్షలకు హాజరు అయ్యేందుకు సిద్ధమవుతున్న 800మంది టెన్త్ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ? పేదరిక నిర్మూలనకు విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. గత ఏడాది అత్యధికంగా 92 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని, ఈ ఏడాది ప్రతి విద్యార్థి పాస్ కావాలన్న ధ్యేయంతో నియోజకవర్గంలోని టెన్త్ విద్యార్థులకు సబ్జెక్ట్ నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భవిష్యత్తులో మన పేరు పాఠ్య పుస్తకాల్లో ఎక్కే స్థాయికి ఎదగాలనే ఆకాంక్షతో చదివితే కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఉత్తమ ఫలితాలు అందుకుంటారని తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ.సుబ్బారావు మాటాడుతూ.. ఈ ఏడాది కృష్ణాజిల్లా టెన్త్ ఫలితాల్లో స్టేట్ టాప్-5లో నిలిపే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా సబ్జెక్టు నిపుణులు షాజా బేగం, కే.వాహిని, ఝాన్సీ లక్ష్మిభాయ్, టీ.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ఆర్.రత్నగిరి, యేసుపాదం, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర రావు విద్యార్థులకు తమ సబ్జెక్ట్ వారీగా శిక్షణ ఇచ్చి సందేహాలు నివృత్తి చేశారు.

నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), ఎంఈఓలు జీ.ఎన్.బీ.గోపాల్, ఎన్.శివశంకర్, కందుల సుజాత, పీ.వెంకటేశ్వరరావు, మోమిన్, సనకా శ్రీకాంత్, ఆలా వెంకట రమణ, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, విశ్రాంత హెచ్ఎం జీవీ తాతారావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

# చోరీకి గురైన మొబైల్స్ రికవరీ

అమరావతి, డిసెంబర్ 29:చోరీకి గురైన మొబైల్ ఫోన్స్‌ను బాపట్ల జిల్లా పోలీస్ అధికారులు రికవరీ చేసి ఈ రోజు ఎస్పీ ఉమామహేశ్వర్ చేతుల మీదుగా బాధితులకు పంపిణీ చేశారు. సోమవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన వార్షిక సమావేశంలో మొబైల్ రికవరీ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ఫోన్లు పోగొట్టుకున్న కొంతమంది బాధితులకు అందజేశారు.

మిగతా వారికి ఆయా స్టేషన్లలో నమోదైన ఫిర్యాదులను ఆధారంగా వారిని పిలిపించి ఇవ్వటం జరుగుతుందని ఎస్పీ చెప్పారు. ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో 258 చోరీకి గురైన మొబైల్ ఫోన్స్ ను రికవరీ చేసి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రికవరీ చేసిన పోలీస్ అధికారులను ప్రశంసా పత్రాలతో ఎస్పీ అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గడచిన మూడు నెలల్లో సుమారు రూ.75 లక్షలు విలువైన 350 మొబైల్ ఫోన్స్ స్వాధీన పరచుకుని సంబంధిత బాధితులకు అందజేసినట్లు తెలియజేశారు. జిల్లా ఏర్పడిన దగ్గర నుంచి చోరీకి గురైన 3,301 మొబైల్స్‌ను రికవరీ చేయటం జరిగిందని ఎస్పీ చెప్పారు. సుమారు రూ.7 కోట్లు విలువ ఉంటుందన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడమే కాకుండా సీఐఆర్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయాలని అవగాహన కల్పించారు.

# ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో సంచలనం రేపిన సామూహిక అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు, మాజీ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్ జైలు శిక్షను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. బాధితురాలి తరపు న్యాయవాదులు దాఖలు చేసిన అప్పీల్‌పై ఇవాళ విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

2017లో ఉన్నావ్ జిల్లాలో 17 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అప్పటి బీజేపీ నేత, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కుల్దీప్ సింగ్ సెంగర్ ఈ కేసులో ప్రధాన నిందితుడు. ఈ కేసులో సెంగర్‌కు జీవిత ఖైదు శిక్ష పడింది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఆ శిక్షను సస్పెండ్ చేసి బెయిల్ మంజూరు చేసింది.

ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ బాధితురాలి తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇవాళ విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. దీంతో సెంగర్ శిక్ష సస్పెన్షన్ తాత్కాలికంగా నిలిచిపోయింది. కేసు తదుపరి విచారణకు వాయిదా పడింది. ఈ కేసు దేశవ్యాప్తంగా రాజకీయ, సామాజిక చర్చనీయాంశంగా మారింది. బాధితురాలి కుటుంబం, మహిళా హక్కుల సంఘాలు సెంగర్ శిక్ష సస్పెన్షన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో బాధితురాలి కుటుంబానికి కొంత ఊరట లభించింది.

# మట్టి అక్రమ తరలింపుపై కలెక్టర్ హనుమంతరావుకు వినతి

నల్గొండ, డిసెంబర్ 29:బీబీనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలో అక్రమంగా మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ పర్యావరణానికి, గ్రామ ప్రజల జీవనానికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని గ్రామస్తులు సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని గోల్డెన్ ఫారెస్ట్ భూములు, ప్రభుత్వ భూములు సహా సర్వే నంబర్లు 35, 37, 538, 554, 555, 563, 527, 570 తదితర ప్రాంతాల్లో గత మూడు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కొందరు ఈ అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతూ, టిప్పర్ల ద్వారా భారీగా మట్టిని తరలిస్తూ కోట్లాది రూపాయలు అక్రమంగా ఆర్జించినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను గ్రామస్తులు పట్టుకుని, డయల్ 100కు సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి వచ్చి టిప్పర్లను వెళ్లిపోవాలని చెప్పినట్లు గ్రామస్తులు ఆరోపించారు.

అనంతరం ఆ మూడు టిప్పర్లను గ్రామానికి తీసుకువచ్చి నిలిపి వేశారు. ఈ విషయమై గతంలోనే ఎంఆర్వో, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా రూ.25 నుంచి 30 కోట్ల విలువైన మట్టిని అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మళ్లీ ఈ సమస్య పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు బండారు శంకర్ గౌడ్, బుయ్యకిశోర్ గౌడ్, దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జక్కి నగేశ్, బండారు రాఘవేందర్ ఉన్నారు.

# చైనీస్ మాంజ వినియోగం, విక్రయంపై నిషేధం : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, డిసెంబర్ 29 : నల్లగొండ జిల్లాలో చైనీస్ మాంజ (నైలాన్/ప్లాస్టిక్ పూతతో తయారు చేసిన ప్రమాదకర దారం) వినియోగం, నిల్వ, విక్రయాలపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

ఈ నిషేధాన్ని ఉల్లంఘించే వ్యాపారులపై ఎలాంటి సడలింపు లేకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చైనీస్ మాంజ కారణంగా చిన్నపిల్లలు, యువకులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలకు గురవుతున్న ఎ ం టన ల ు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా మెడ, ముఖం, చేతులకు ప్రాణాంతక గాయాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా పక్షులు, విద్యుత్ తీగలు, ప్రజా ఆస్తులకు కూడా భారీ నష్టం జరుగుతోందన్నారు.

చైనీస్ మాంజ విక్రయాలు పూర్తిగా అరికట్టేందుకు జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి, దుకాణాలు, గోదాములు, తాత్కాలిక స్టాళ్లు, రహస్య నిల్వలు అదేవిధంగా ఆన్‌లైన్ విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో చైనీస్ మాంజ విక్రయాలు లేదా నిల్వలు బయటపడితే మాంజను వెంటనే స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అవసరమైతే అరెస్టులు కూడా చేస్తామని హెచ్చరించారు. అలాగే నిషేధాన్ని ఉల్లంఘించిన వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయించడంతో పాటు, దుకాణాలు, గోదాములను సీజ్ చేయడానికి రెవెన్యూ, మున్సిపల్ శాఖలతో సమన్వయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# అత్యవసర వైద్య సేవలు అందించాలి

**-జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నలుగూరి జనార్ధన్**

కామారెడ్డి, డిసెంబర్ 29: కమ్మర్ పల్లి మండల కేంద్రంలో అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించే 108 అంబులెన్స్ ను 108కి సంబంధించిన ఉన్నతాధికారులు ఇవాళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ నలుగూరి జనార్ధన్ 108 వాహనాన్ని, రికార్డులను తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు, వైద్య పరికరాలు వాటి స్థితిగతులు కనుక్కున్నారు. వాటి నిల్వలు చూసి రికార్డులు పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన అత్యవసర పరిస్థితుల్లో అత్యవసర సేవలు అందించేందుకు సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని, గర్భిణులను ప్రసవ సమయంలో ఆసుపత్రికి అంబులెన్స్ లోనే తరలించేలా క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. వాహనాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందులోని వైద్య పరికరాలపని తీరును ప్రతి రోజు పర్యవేక్షించాలని, అలాగే రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరును అభినందించారు. వాహనాన్ని కండిషన్ లో ఉంచుకోవాలని, పైలెట్లు కేఎంపీఎల్ ను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా కో ఆర్డినేటర్ బొండ్ల స్వరాజ్, 108 సిబ్బంది ఈఎంటి జగదీష్, పైలట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

# సర్పంచు, వార్డు సభ్యులకు సన్మానం



నాగిరెడ్డిపేట, డిసెంబర్ 29: ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాగిరెడ్డిపేట మండలంలో పద్మశాలీల నుండి ఎంపికైన సర్పంచులు, వార్డు సభ్యులను మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలోని జప్తి జానకంపల్లి సర్పంచ్ వర్షిణీతో పాటు 13 మంది వార్డు సభ్యులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనర్సయ్య, జనరల్ సెక్రెటరీ బొమ్మడి రాజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బోగ వెంకటనారాయణ, దూస వెంకటస్వామి, పాగల రాజయ్య, ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు పొశెట్టి, నాగిరెడ్డిపేట మండలాధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు విఠల్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలి..

**-కలెక్టర్ రాహుల్ రాజ్‌కు పద్మాదేవేందర్ రెడ్డి విజ్ఞప్తి**

మెదక్,డిసెంబర్ 29: సింగూర్ నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలని, లేదా క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఎం పద్మాదేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు.అనంతరం పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయ కట్టుకు నీటి విడుదలపై ప్రభుత్వం ఎలాంటి అధికారికంగా ప్రకటన చేయకపోవడంతో జిల్లా రైతాంగం అయోమయంలో ఉందన్నా రు. ప్రభుత్వం వెంటనే స్పందించి సింగూర్ నుండి ఘనపూర్ ఆయ కట్టుకు నీటిని విడుదల చేయిస్తా రా..లేదా.. క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాము.సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే ఘనపూర్ ఆయకట్ట కింద పంటలు సాగుతాయని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ సింగూర్ నీళ్ల విషయంలో అధికారికంగా ప్రకటన చేయకపోవడం రైతులను అయోమయానికి గురి చేస్తుందని ఈ విషయంపై ప్రభుత్వం మొండి వైఖరి తగదని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రతీ పంటకు నీరందించిన ఘనత కేసీఆర్‌దని అన్నారు. సింగూర్ నుండి హైదరాబాద్‌కు నీళ్లు తీసుకెళ్లకుండా మెదక్ జిల్లాకు నీరును అంకితం చేసింది కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని మండిపడ్డారు. వానకాలం జరిగిన నష్టపరిహారం ఇప్పటివరకు రైతులకు చెల్లించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగూర్ నుండి నీటిని విడుదల చేస్తారా.. లేదా క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారా.. అనే విషయమై ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నామని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. లేని యెడల బీఆంఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, మాజీ ఎంపీపీలు కొత్తపల్లి కిష్టయ్య,దుర్గయ్య,మాజీ కౌన్సిలర్లు విశ్వం, మాయ మల్లేశం చంద్రకళ,సోహెల్, పట్టణ పార్టీ కోకన్వీనర్లు కృష్ణ గౌడ్ లింగారెడ్డి, సర్పంచ్ లు సాంబ శివరావు, మ్యాకల. సాయిలు ,నాయకులు సోములు,మెడిశెట్టి. శంకర్, సాయిలు, రాజు,ఉదయ్, రామచంద్ర రెడ్డి మోహన్ నాయక్ రాజు, శ్రీనాథ్ రావు ,సంగమేశ్వర్, బద్రి. మల్లేశం,మాజీ సర్పంచ్ లు, మెదక్ పట్టణం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉనక లారీ బోల్తా.. ప్రమాదంలో బొలెరో నుజ్జు నుజ్జు.. డ్రైవర్ మృతి

రాంపూర్, డిసెంబర్ 29: ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉనక లారీ బోల్తాపడింది. ఓ సిగ్నల్ వద్ద టర్నింగ్ తీసుకుంటున్న బొలెరో వాహనంపై ఆ ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న డ్రైవర్ మృతిచెందాడు. ఈ ప్రమాదానికి చెందిన సీసీటీవీ వీడియో వైరల్ అవుతున్నది. రాంపూర్-నైనిటాల్ హైవే మీదున్న పహాడి గేటు సిగ్నల్ వద్ద ప్రమాదం జరిగింది. టర్నింగ్ తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన ఉనక లారీ ఢీకొట్టింది. అయితే ప్రమాదాన్ని తప్పించేందుకు లారీ డ్రైవర్ ప్రయత్నించాడు. కానీ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఉనక లారీ .. ఆ వేగంతో బొలెరో వాహనంపై పడింది. విద్యుత్తు శాఖ సబ్ డివిజనల్ ఆఫీసర్‌ను ఆఫీసు వద్ద దించి వస్తున్న బొలెరో డ్రైవర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.

# గంజాయి రహిత జిల్లాగా రూపుదిద్దాం

**-నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో 4 సీసీ కెమెరాలు..!**
**-పాఠశాల విద్యార్థులకు అండగా "ఖాకీ కిడ్స్"?!**
**-తగ్గిన రోడ్డు ప్రమాదాలు.. పెరిగిన దొంగతనాలు..**
**-ఆదిలాబాద్ జిల్లా వార్షిక క్రైమ్ రిపోర్ట్ విడుదల**




ఆదిలాబాద్, డిసెంబర్ 29:శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ఆదిలాబాద్ జిల్లా పోలీసులు చేపట్టిన సంస్కరణలతో ఆశించిన ఫలితాలు సాధించామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ రోజు మధ్యాహ్నం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా వార్షిక క్రైమ్ రిపోర్ట్ ను విడుదల చేశారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను చిత్తు చేసు కుంటున్నారని, కొత్త సంవత్సరంలో గంజాయి రహిత జిల్లాగా రూపుదిద్దామని ఎస్పీ స్పష్టం చేశారు. పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పకడ్బందీగా పర్యవేక్షిస్తామన్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న ఆదివాసుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, వారి పిల్లల అక్షరాస్యతను పెంపొందించేలా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో విడీసీ పేరుతో చట్ట విరుద్ధంగా పనిచేస్తున్న కమిటీలను సమూలంగా నియంత్రించి వారిపై కేసులు కూడా నమోదు చేశామన్నారు.

2025 సంవత్సరంలో సైబర్ క్రైమ్ రేట్ తో పాటు శాంతి భద్రతల విషయంలో నేరాలు పెరిగినప్పటికీ, దొంగతనాల కేసుల్లో 48 శాతం రికవరీ సాధించామన్నారు. గత సంవత్సరం 129 రోడ్డు ప్రమాదాలు దొరికితే ఈసారి 109 ప్రమాదాలు సంభవించాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీస్ శాఖ సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని స్పష్టం చేశారు. మెసేజ్ యువర్ ఎస్పి, ఆపరేషన్ చబుత్ర, ఆపరేషన్ జ్వాలా, పోలీసు అక్క, అభయ మై టాక్సీ తదితర వినూత్న కార్యక్రమాలతో పోలీసులు ప్రజలకు చేరువవుతున్నారని ఎస్పీ అన్నారు. పాఠశాల విద్యార్థులకు అండగా "ఖాకి కిడ్స్" కార్యక్రమం 2026 లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. నూతన సంవత్సరానికి పురస్కరించుకొని రోడ్లపై యువత పూటుగా తాగి, న్యూసెన్స్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని, రోడ్లపై ఎక్కడికక్కడ ఏఆర్ పోలీస్ జలాలను రంగంలోకి దించుతున్నట్టు ఎస్పీ తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన 127 మందిపై రౌండ్ షీట్లు తెరిచినట్లు తెలిపారు. ఏడాది రికార్డు స్థాయిలో 717 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, సైబర్ క్రైమ్ నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక అమలు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. మిడియా సమావేశంలో అదనపు ఎస్పీ పి మౌనిక, ట్రైనీ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఏర్పాట్లు..

**-శ్రీశైలంలో డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి ఉత్సవం**

శ్రీశైలం డిసెంబర్ 29:నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహిం చబడుతుందని కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉత్సవం సందర్భంగా వేకువజామున స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉత్తరద్వార దర్శనం, రావణవాహనసేవ నిర్వహించబడుతాయన్నారు. ఉత్సవాలలో భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తర ద్వా రం నుంచి వెలుపలకు తోడ్కొని వచ్చి ఆలయం ఉత్తరభాగంలో రావణవాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపిం చబడతాయన్నారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉదయం 3గంటలకు ఆలయ ద్వారాలను తెరచి మంగళ వాయిద్యాల అనంతరం గం.3.30ని.లకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించబడుతుందన్నారు.

అనంతరం స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాల పూజలు నిర్వహించి గం.4.30 ని.లకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహా మంగళ హారతులు జరిపించబడతాయన్నారు. అనంతరం ఉదయం 5. 30ని లకు రావణ వాహనసేవ జరిపించబడుతుందన్నారు. ఆ తరువాత స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించబడుతుందన్నారు. ఉదయం 6 గంటల తర్వాత దర్శనాలు, ఆర్జితసేవలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేశామని తెలిపారు.

# యువశక్తే భారత్‌కు ప్రధాన బలం: ప్రధాని మోడీ



వారణాని డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఈ ఏడాది భారత్ ఎన్నో ఘన విజయాలు సాధించిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. కుంభమేళాకు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది తరలివచ్చారని, ప్రయాగ్ రాజ్ కుంభమేళాతో 2025 ప్రారంభం అయిందని అన్నారు. మన్ కీ బాత్ 129వ ఎపిసోడ్ లో మోడీ పాల్గొన్నారు. మన్ కీ బాత్ లో దేశ ప్రజల్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అంతరిక్షయానంతో శుభాంశుశుక్లా భారత కీర్తిని మరింత పెంచారని, 'ఆపరేషన్ సింధూర్' ప్రతి భారతీయుడికి గర్వకారణంగా నిలిచిందని కొనియాడారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్ రెండో సదస్సును త్వరలోనే నిర్వహించునున్నామని, కొత్త ఆశలు, నూతన సంకల్పంతో 2026లోకి అడుగు పెడుతున్నామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రెండో యంగ్ ఇండియా లీడర్ సదస్సు జనవరి 12న జరగనుందని, వివిధ ప్రాంతాల యువత సదస్సులో ఆలోచనలు పంచుకుంటున్నారని అన్నారు. యంగ్ ఇండియా లీడర్ సదస్సులో తాను తప్పనిసరిగా పాల్గొంటానని తెలియజేశారు. యువశక్తే భారత్ కు ప్రధాన బలమని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సరికొత్త టెక్నాలజీ, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని సూచించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లో విద్యార్థులు 70 అంశాలపై ప్రతిభ చూపారని, స్మార్ట్ ట్రాఫిక్, సైబర్ సెక్యూరిటీపై ఆవిష్కరణలు ప్రదర్శించారని మోడీ పేర్కొన్నారు. గతేడాది వారణాసిలో కాశీ-తమిళ సంగమం జరుపుకున్నామని, వారణాసిలోని పిల్లలు తమిళం మాట్లాడుతున్నారని అన్నారు. మాతృభాష హిందీ అయినప్పటికీ తమిళం నేర్చుకుని మాట్లాడుతున్నారని, దేశంలో చిరుతల సంఖ్య 30 దాటిందని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో ఈ నెల 31వ తేదీ వరకు చలి తీవ్రత

హైదరాబాద్ డిసెంబర్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్రం చలి గాలులతో గజగజ వణుకుతుంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలకు తోడు చలి గాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. ఉదయం 11 గంటలు అయినా చలి తీవ్రత తగ్గకపోవడం, మధ్యాహ్నం ఒక్కసారిగా ఎండవేడి వాతావరణం, సాయంత్రానికే మళ్లి చలి ప్రారంభం కావడంతో చిన్నారులు, వృద్ధులు, మ హిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ఈ నెల 31వ తేదీ వరకు ఈ చలి తీవ్రతం కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగి చలి తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. జనవరి నెల ప్రారంభంలో సాధారణ శీతాకాలం ఉన్నా, సంక్రాంతికి మళ్లీ చలి పెరిగి, చివరి వారం నుంచి తగ్గుముఖం పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశల నుండి వీస్తున్నాయి. దీంతో నాలుగైదు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 3 నుండి 4 డిగ్రీలు తక్కువ నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం, సోమవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో శనివారం ఉదయం వరకు కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 7.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, సంగారెడ్డి 7.6, ఆదిలాబాద్ 8.8, రంగారెడ్డి 9.2, సిద్దిపేట 9.4, కామారెడ్డి 9.5, నిర్మల్ 10 డిగ్రీల ఉష్ణోగత్రల నమోదయింది. దీంతో పాటు ఆదివారం తొమ్మిది జిల్లాలకు వాతావరణ కేంద్ర ఆరంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# ప్రేమ పేరుతో మైనర్ బాలిక గర్భవతి..
# ప్రియుడిని అరెస్టు చేసిన పోలీసులు

అమరావతి డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మైనర్ బాలికను గర్భవతిని చేసిన ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలో పాలసముద్రం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాలసముద్రం మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికకు దినేష్ అనే యువకుడు మాయమాటలు చెపి లోబరుచు కన్నాడు. కు మార్తె శరీరంలో మార్పులు రావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

బాలిక గర్భవతి అని తెయడంతో బాలికను నిలదీయడంతో దినేష్ పేరు చెప్పింది. వెంటనే పాలసముద్రం పోలీస్ స్టేషన్ లో తల్లిదం డ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజశేఖర పోక్సో యాక్టు కేసు నమోదు చేసి దినేష్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. డి.ఎస్.పి సయ్యద్ మహమ్మద్ అజిజ్ ఆధ్వర్యంలో సిఐ హనుమంతప్ప లోతుగా విచారణ చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రామీణ ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోంది: మంత్రి పొన్నం

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ ప్రధానులు తెచ్చిన సంస్కరణల వల్లే దేశం ముందుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గాంధీభవన్ లో కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. మన జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన గ్రామస్వరాజ్యం స్ఫూర్తిగా నరేగాను యూపిఏ ప్రభుత్వం తెచ్చిందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా చేసేందుకే ఎంజి నరేగా తెచ్చారని అన్నారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి జి రాం జి అనే పేరు పెట్టారని, గ్రామీణ ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధి పథకాన్ని విస్తరిసామని చెప్పి.. ఇప్పుడు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాలపై భారం మోపేలా కొత్త చట్టంలో 60:40 శాతం నిధుల నిబంధన పెట్టారని, కేంద్రం ఇప్పటికే రాష్ట్రాలపై తీవ్ర భారాన్నిమోపిందని ధ్వజమెత్తారు. గాంధీ, దివంగత మాజీ ప్రధానమంత్రులు నెహ్రూ గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు చరిత్రలో లేకుండా చేయాలని బిజెపి కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు ప్రతి గ్రామంలో గాంధీ ఫోటోలతో పనిచేస్తూ నిరసనలు తెలపాలని, ఉపాధి హామీపథకాలన్ని దెబ్బతీసేలా చేసిన బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోవాలని సూచించారు. బిజెపి నిర్ణయాన్ని నిరసిస్తూ తీర్మానం చేసి ప్రధాని నరేంద్ర మోడీకి పంపాలని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అందరూ మంత్రులు, నేతలు పాల్గొన్నారు.

# అసెంబ్లీని కనీసం 15 రోజులు నడిపించాలి..

**-కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డిమాండ్**

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కువ రోజులు సమావేశాలు నడిపించామని గుర్తుచేశారు. దాదాపు ఒక సెషన్ 32 రోజులు నడిపించామని తెలిపారు. కాంగ్రెస్ మొత్తంగా 16 రోజులు నడిపించిందని పేర్కొన్నారు. రెండేళ్లలో ఓవరాల్‌గా రేపటికి 40 రోజులు జరిపిందని చెప్పారు. సభ నడపాలంటే కాంగ్రెస్ జంకుతుందని అన్నారు. శాసన సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని హరీశ్‌రావు అన్నారు. ఎమ్మెల్యేల సంతాపాలు, ఘోష్ కమిషన్ విషయాల మీదే సభ నడిపారని తెలిపారు. మేం లేవనెత్తిన ఒక్క అంశం మీద కూడా చర్చ పెట్టల్లేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే ప్రతిపక్షం బాధ్యత అని స్పష్టం చేశారు. అధికార బలంతో ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. మందబలం ప్రదర్శించి సభను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసీఆర్ మాట్లాడిన అంశాలను.. మాపై మళ్లీ బురద జల్లడానికి అసెంబ్లీని నడుపుతున్నారని విమర్శించారు. 45 టీఎంసీలకు మీరు సంతకం పెట్టారా లేదా సూటిగా చెప్పండని ప్రశ్నించారు. 45 టీఎంసీలకు ఒప్పుకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 45 టీఎంసీలతో రంగారెడ్డిని ఎండబెడుతారా అని నిలదీశారు. డీపీఆర్ వాపస్ వచ్చిందా లేదా.. ఆ సంతకం మీదా కాదా.. అని ప్రశ్నించారు.

# పిఎం లంకను తాను దత్తత తీసుకోవడం కాదని..
# ప్రజలే తనను దత్తత తీసుకున్నారు

**-కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్**




అమరావతి డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గ్రామాల దత్తత.. ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పిఎం లంకను తాను దత్తత తీసుకోవడం కాదని.. ప్రజలే తనను దత్తత తీసుకున్నారని అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పెదమైనవానిలంకలో డిజిటల్ భవన్ ను సందర్శించారు. డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, ఎఐ నైపుణ్య శిక్షణ కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పిఎం లంకలోని సైక్లోన్ భవనం అన్ని విధాలుగా ఉపయుక్తమని, మహిళల మద్దతుతో సైక్లోన్ భవనం డిజిటల్ భవనంగా మారిందని తెలియజేశారు. ఈ భవనంలోనే విశ్వకర్మ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి ఉపాధి ఉంటుందని, శిక్షణ పొందిన యువత దేశ, విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నారని నిర్మలా పేర్కొన్నారు. శిక్షణపై సర్వేలో రెండో స్థానంలో పిఎం లంక నిలిచిందని, జాలర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి ఉంటుందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి మరిన్ని ఆలోచనలు చేయాలని, డ్రోన్ వినియోగంపై ఎపిలో తొలిసారి పిఎం లంకలో శిక్షణ ఇస్తున్నారని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# కొండగట్టు దేవాలయంలో జనవరి 3న
# 35 కోట్లతో 96 గదుల నిర్మానానికి శంకుస్థాపన

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కొండగట్టు దేవాలయంలో జనవరి 3న 35 కోట్లతో 96 గదుల నిర్మానానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేస్తున్నట్లు టీటీడీ హిమాయత్ నగర్ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ నేమూరి శంకర్ గౌడ్ తెలిపారు. కొండగట్టు దేవాలయంలో టీటీడీ సహకారంతో భక్తుల సౌకర్యార్థం 35 కోట్లతో 96 గదుల నిర్మాణం, కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ శంఖు స్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొని శంకుస్థాపన చేయనున్నట్లు శంకర్ గౌడ్ వెల్లడించారు.

# అసెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**-బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు ఘన స్వాగతం**

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి చేరుకున్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసం నుంచి బయల్దేరిన ఆయన అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు ఘన స్వాగతం పలికారు..కేసీఆర్ అసెంబ్లీకి చేరుకోవడంతో మంత్రివర్గంలో అలజడి మొదలైనట్టు తెలిసింది. ప్రజా ప్రభుత్వం పేరుతో ప్రజా వ్యతిరేక విధానాలు అవలం బిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌ను సభలోనే గట్టిగా నిలదీయాలని కేసీఆర్ నిర్ణయించి, పార్టీ సభ్యులను సిద్ధంచేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్టు కనిపిస్తున్నది. దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమా ండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. కేసీఆర్‌తో సబ్జెక్టు మాట్లాడటం కష్టమని, ఆ స్థాయిని తాము అందుకోలేమనే ఆందోళనతో అధికారపక్షం ఉన్నట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశా లను ఎక్కువ రోజులు సాగదీయ కుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చి నట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొద టిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి (ఆర్ తిరుపతి) అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

# కొండాపూర్‌లోని క్వేక్ ఎరీనా పబ్‌లో ఈగల్ బృందం సోదాలు

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెన్ న్యూన్ );: కొండాపూర్‌లోని క్వేక్ ఎరీనా పబ్‌లో ఈగల్ బృందం సోదాలు నిర్వహించింది. ఎనిమిది మంది డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు చిక్కారు. మొత్తం 14 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఎనిమిది మందికి పాజిటివ్‌గా తేలింది. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా క్వేక్ పబ్‌లో ఉక్రెయిన్‌కి చెందిన ప్రముఖ డిజె ఆర్బాట్స్‌తో కాన్సర్ట్ నిర్వహించారు. ఈ క్రమంలో సైబరాబాద్ పోలీసులతో కలిసి ఈగల్ బృందం పలు పబ్బుల్లో తనిఖీలు నిర్వహించింది. డ్రగ్స్ కేసులో 10 రోజుల్లో 27 మందిని ఈగల్ బృందం అరెస్ట్ చేసింది. అరెస్టైన వారిలో నలుగురు విదేశీ మహిళలతో సహా 17 మంది వినియోగదారులు ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 68 గ్రాముల కొకైన్, 50.5 గ్రాముల ఎండిఎంఎ, 382 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

# కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్‌కు చెందిన యువతులు దుర్మరణం

మహబూబాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) : అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్‌కు చెందిన యువతులు దుర్మరణం చెందారు. మహబూబాబాద్ జిల్లా మీసేవ కేంద్రం నిర్వాహకుడు నాగేశ్వరరావు కూతురు మేఘన, ముల్కనూర్ ఉప సర్పంచ్ కోటేశ్వరరావు కూతురు భావన ఉన్నత చదువుల కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మేఘన, భావన మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని 30న హిమాయత్ నగర్ టీటీడీ శ్రీవారి వైకుంఠ దర్శనం



హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 30న హిమాయత్ నగర్ టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు శ్రీవారి వైకుంఠ దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ హిమాయత్ నగర్ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ నేమూరి శంకర్ గౌడ్ వెల్లడించారు. ఆదివారం టీటీడీ ఆవరణలోని హిమాయత్ నగర్ తిరునిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో టీటీడీ డిప్యూటీ ఏఈవో రమేష్ తో కలిసి మాట్లాడారు. ఈనెల 29వ తేదీ తెల్లవారు ఝామున 1.30 గంటల నుంచి 30 వ తేది రాత్రి 11 గంటల వరకు భక్తులను వైకుంఠ ద్వారా శ్రీవారి సర్వదర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా మంచినీరు, విద్యుత్, ట్రాఫిక్ సమస్య లేకుండా శ్రీవారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. దర్శనం అనంతరం భక్తులను తీర్థప్రసాదలతోపాటు అన్నదాన ప్రసాద వితరణ చేస్తున్నామని ఆయన చెప్పారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి జరిగే పూజా కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు. 30వ తేదీ తెల్లవారు ఝామున అర్చక వేద పండితులచే 12 గంటల నుంచి శ్రీవారికి ఏకాంత సేవ 12.20 నుంచి 12.40 తిరుప్ప సేవతోపాలు తోమాల సేవ, సహస్ర ఆర్చన, ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 1:30 నుంచి రాత్రి అర్ధరాత్రి వరకు భక్తులకు సర్వ దర్శనం కొనసాగుతుందన్నారు. మధ్య, మధ్యలో శ్రీవారికి ఏకాంత సేవలు కొనసాగుతాయని, ప్రత్యేకంగా వృద్దులు, వీఐపీలు కూడా స్వామివారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. దేవాలయం సిబ్బంది, పోలీసులు సూచించిన ప్రదేశాలలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని ఆయన భక్తులకు సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ అధికారులు మణికంఠ శ్రీనివాస్, లక్ష్మీపతి, అర్చక వేద పండితులు ప్రహ్లాదచారి తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**-శాసనసభలో ఆది శ్రీనివాస్ గళం**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29:నేటినిజం (ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ రాష్ట్ర శాసనసభలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ అంశాలపై కీలకంగా మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సలహా మండలి ఏర్పాటు చేయడంతో పాటు, గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఆయన గుర్తు చేశారు. 2026-27 బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి, వారికి సమగ్ర సహాయం అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సీఎం ప్రవాసి ప్రజావాణి ఫిర్యాదు కేంద్రంలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు.గల్ఫ్ కార్మికుల పిల్లల విద్యకు పెద్దపీట వేయాలని, సుమారు 10 లక్షల మంది గల్ఫ్ కార్మికుల పిల్లలు ఉన్న నేపథ్యంలో, 2026-27 విద్యా సంవత్సరానికి గురుకులాల్లో వారికి ప్రత్యేకంగా సీట్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రవాసి భారతీయ దివస్ తరహాలో, రాష్ట్ర స్థాయిలో "ప్రవాసి తెలంగాణ దివస్" నిర్వహించి, ప్రవాసులను సత్కరించడంతో పాటు వారి సమస్యలను వినడం ద్వారా వారికి మనోధైర్యం కల్పించవచ్చని తెలిపారు.గల్ఫ్ వలస తాత్కాలికమైనదని పేర్కొంటూ, గల్ఫ్ ఎన్ఆర్ఐల కుటుంబాలకు సంబంధించిన రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులను సులభతరం చేసి, ప్రభుత్వం వారి అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గల్ఫ్ కార్మికులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వంతు అందిస్తున్నారని, వారి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు.వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రతి నెల సుమారు 100 ప్రసవాలు జరుగుతున్నాయని ప్రస్తుతం ఉన్న మాత శిశు సంరక్షణ(ఎం సీ హెచ్) సెంటర్‌ను 50 పడకలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు.

# రూ.2.71లక్షల విరాళాలతో 56మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ



కరీంనగర్, డిసెంబర్ 29: పేద విద్యార్థుల చదువుకు తోడ్పడాలనే లక్ష్యంతో మిత్రబృందం చూపిన ఔదార్యం అందరి మనసులను హత్తుకున్నది. విద్యకు దూరమవుతున్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పలువురు పేదవిద్యార్థులకు ఫేస్ బుక్ మిత్రులు రూ.2.71లక్షల విరాళాలతో 56 మంది విద్యార్థులకు 56 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మపురి, బీర్పూర్ మండలాలకు చెందిన పలువురు విద్యార్థులు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. అయితే వారివారి గ్రామాల నుండి ఉన్నత విద్య కోసం కొంత దూరంగా ఉన్న పక్కగ్రామాలకు నడుచుకుంటూ పాఠశాలలకు వెలుతున్నారు.

అయితే వీరి పరిస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి పేదవిద్యార్థులకు సైకిళ్లను అందజేసి వారి చదువుకు తోడ్పడదామని మిత్రులను కోరుతూ ఫేస్ బుక్‌లో పోస్టు చేశాడు. ఈ పోస్టుకు స్పందించిన పలువురు దాతలు రూ.2.71లక్షల విరాళాలను అందజేయగా వాటితో 56 సైకిళ్లను కొనుగోలు చేశారు. సోమవారం ధర్మపురి పట్టణంలోని న్యూటీటీడీ కల్యాణమండపంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి వేదిక ద్వారా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ చేతులమీదుగా సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేయించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి సేవాకార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పోలీస్ శాఖ తరఫున పేదవిద్యార్థుల కోసం మరో రెండు సైకిళ్లను అందజేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక సైకిల్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలకు,సామాజిక సేవకునికి విద్యార్థులు, తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ మహేశ్, ఎంఈవో సీతాలక్ష్మి, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సరిపడా యూరియా నిల్వలు లభ్యం: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**-ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి యూరియా పంపిణీ ప్రారంభం**

**-యూరియా లభ్యతపై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, డిసెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి) : ఖమ్మం జిల్లాలో సరిపడా యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజులకు సంబంధించి 13వేల 642మెట్రిక్ టన్నుల యూరియా ఖమ్మం జిల్లాకు అవసరం ఉండగా, మనకు ఇప్పటి వరకు 9వేల 407 మెట్రిక్ టన్నుల స్టాక్ వచ్చిందని, జిల్లాలో మరో 5వేల 100మెట్రిక్ టన్నుల స్టాక్ రిజర్వ్ ఉందని కలెక్టర్ తెలిపారు. యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేదని తెలిపారు. ఖమ్మం జిల్లాలో యూరియా బుకింగ్ యాప్ వచ్చే వరకు ఆఫ్ లైన్ పద్ధతిలో రైతు పట్టాదారు పాస్ పుస్తకం పరిశీలించి యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సాగు చేసే పంట స్వభావం అనుగుణంగా యూరియా సరఫరా చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో యూరియాకు ఎటువంటి కొరత లేదని ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి ప్రతి కొనుగోలు కేంద్రం ద్వారా యూరియా అందిస్తున్నామని రైతులు ఆందోళన చెందకుండా అవసరమైన మేర యూరియా కొనుగోలు చేసి తీసుకుని వెళ్లాలని, అధికంగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుంగతుర్తి పంచాయతీకి ఫ్రీజర్ అందజేత


నల్గొండ, డిసెంబర్ 29: అక్షర ఫౌండేషన్, సూర్యాపేట ఆధ్వర్యంలో ఎస్ కె ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సూర్యాపేట వారి సౌజన్యంతో తుంగతుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయానికి బాడీ ఫ్రీజర్ బాక్స్ సంకినేని రవీందర్ రావు అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఉచిత ఫ్రీజర్‌ను అందజేసి మాట్లాడారు. ప్రతి ఒక్కఉ సామాజిక స్పృహ కలిగి ఉండాలని, పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ఫ్రీజర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వైకుంఠ దామ యాత్ర వాహనం త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. తుంగతుర్తి, పరిసర గ్రామాల ప్రజలకు ఫ్రీజర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్రీజర్‌ను అందజేసినట్లు వెల్లడించారు.

విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న అక్షర ఫౌండేషన్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అక్షర ఫౌండేషన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్రీజర్ కావాల్సిన వారు 95159 38163, 7036 259922 నంబర్లను సంప్రదించి తీసుకు వెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబు, ఉప సర్పంచ్ యలగందుల శ్రీను, పంచాయతీ కార్యదర్శి మడిపెద్ది శ్రీనివాస్, నారాయణదాసు నాగరాజు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# అర్చకుల సమస్యలను పరిష్కరించేలా కృషి

**– టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అర్చకుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి, పరిష్కరించేలా చూస్తానని



టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.ధూప దీప నైవేద్య అర్చక సంఘం.. తెలంగాణ రాష్ట్రం మరియు ఉమ్మడి మెదక్ జిల్లా (సంగారెడ్డి సిద్దిపేట మెదక్) ఆధ్వర్యంలో.. రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ గారి ఆధ్వర్యంలో.. దూపదీప నైవేద్య అర్చక సమస్యలపై అర్చక చైతన్య యాత్ర చేయడం జరిగింది.. ఇందులో భాగంగా సంగారెడ్డి అధ్యక్షులు మడుపతి అద్వయ్య స్వామి, మెదక్ జిల్లా అధ్యక్షులు శలాక రాజేశ్వర్ శర్మ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చాడనంద బాల శర్మ మరియు కార్యదర్శులు, శ్యామ్ సుందర్ శర్మ, వీరభద్రయ్య స్వామి, చిదిరే రాజశేఖర్ శర్మ కోశాధికారులు. ఎం శంభు ప్రసాద్ స్వామి, ప్రవీణ్ శర్మ, రాజ మనోహర్ శర్మ. మహేష్ స్వామి మరియు రాష్ట్ర బాధ్యులు , నియోజకవర్గ కన్వీనర్లు మండల కన్వీనర్లు మూడు జిల్లాల అర్చకులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఐఐసీ చైర్ పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి గారు పాల్గొన్నారు.. వారికి అర్చక సంఘం తరఫున అర్చక సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది.. ఇందులో ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ప్రభుత్వ పథకాలలో చోటు, ఇందిరమ్మ ఇల్లు తదితర విషయాలు అడగడం జరిగింది, మరియు అర్చకులు ర్యాలీగా వెళ్లి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ గారికి అర్చక సంస్థలపై వినతిపత్రం సమర్పించినారు.. టీజేఏసీ చైర్మన్ మాట్లాడుతూ అర్చక సమస్యలు కచ్చితంగా తీరుస్తామని సీఎం దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.

# క్రీడలు స్నేహబాంధవ్యానికి ప్రతీక

**-ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్**

**-హెచ్ పిఎల్ విజేతలకు ప్రైజ్ మనీ..**

**-ట్రోఫీ అందజేసిన ఎంఐఎం నేతలు**

కరీంనగర్ డిసెంబర్ 29క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి, స్నేహ బాంధవ్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. నగరంలోని హుస్సేనీపుర వెలమ గ్రౌండ్ 32 వ డివిజన్ పరిధిలో నిర్వహించిన హుస్సేనీపుర ప్రీమియర్ లీగ్ హెచ్పిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హాజరై మాట్లాడారు. రాజకీయ పరమైన సేవలు ప్రజలకు అందించడంతోపాటు ముఖ్యంగా క్రీడల నిర్వహణలో.. యువతను ప్రోత్సహించడంలో ఎంఐఎం పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు. గెలుపొందిన విజేతలకు గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి అబ్బాస్ సమి, 33వ డివిజన్ ఎంఐఎం నేత అజర్ దబీర్, ప్రైజ్




నగదు ప్రైజ్ మనీ, ట్రోఫీలను, మెడల్స్ నీ అందజేశారు. సీనియర్ విభాగంలో విన్నర్ గా అఫ్రూ ఎలెవన్, రన్నర్ గా అద్నాన్ ఎలెవన్, జూనియర్ విభాగంలో విన్నర్ గా ఇమ్రాన్ ఎలెవన్, రన్నర్ గా అఫియాన్ ఎలెవన్ నిలిచారు. ఈ క్రీడల నిర్వహణ మాజీ డిప్యూటీ మేయర్ మనీ ఇబ్రహీం అబ్బాస్, హసన్ అబ్బాస్ స్పాన్సర్ చేశారు. ఈకార్యక్రమంలో ఆర్గనైజర్ సల్మాన్ టీమ్, ఎంఐఎం నాయకులు ఇబ్రహీం, అలిబాబా, జమ్మూ, నదీమ్ ఇక్బాల్, అబుజర్, యాకూబ్ పాషా, ఇబ్రహీం, రఫిక్, ఇష్తియాక్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీలో చేరికలు

**-స్వాగతం పలికిన బీజేపీ నేత వికాస్**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29:నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలంలో చీర్లవంచ గ్రామ ఉపసర్పంచ్ మచ్చ శేఖర్, ఆరేపల్లి వార్డు సభ్యులు మంజేడి రాంబాబులు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు సమక్షంలో సోమవారం భారతీయ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా భారతీయ జనతా పార్టీలో చేరుతున్నట్టు వారు అభిప్రాయం వ్యక్తపరిచారు.దేశం కోసం ధర్మం కోసం భారతీయ జనతా పార్టీలో చేరడం చాలా గర్వంగా ఉన్నది అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్, ఆరేపల్లి గ్రామ ఉపసర్పంచ్ సిలువేని ప్రశాంత్, మండల ఉపాధ్యక్షులు బిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు సోల్ల దేవేందర్, నాయకులు కట్ట శ్రీకాంత్, బాలకృష్ణ, కంసాని రాము, గాండ్ల తిరుపతి, పోచంపల్లి భాను, సంజీవరెడ్డి, దామోదర్ రెడ్డి, పేరంగాని మల్లేశం, అల్లుగొండ సందీప్, ఏడపెల్లి కళ్యాణ్, జోగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకి పోటీలో అల్ఫోర్స్ విద్యార్థులకు ప్రథమ స్థానం

**-విద్యార్థులకు చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి అభినందన**

కరీంనగర్, డిసెంబర్ 29: కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలలో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు కే ఓం కార్తికేయ (10వ తరగతి), ఎస్ రీషాల్ (9వ తరగతి), ఓ శివ స్మరణ్ రెడ్డి (8వ తరగతి) రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి, ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు.విద్యార్థులు నేటి పోటీ



ప్రపంచంలో అద్భుతమైన ప్రణాళికలతో ఆసక్తికరమైన నమూనాలను రూపొందించి వైజ్ఞానిక శాస్త్రంలో ఖ్యాతి గడించాలని వారు కోరారు.పాఠశాల లో నిపుణులైన వైజ్ఞానిక శాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేస్తున్నమని వారు చెప్పారు.విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైజ్ఞానిక శాస్త్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 4680 భారత్ సెల్ ఆధారిత వాహనాల సరఫరాను విస్తరించిన ఓలా ఎలక్ట్రిక్




హైదరాబాద్, డిసెంబర్ 29:ఓలా ఎలక్ట్రిక్, 4680 భారత్ సెల్‌తో నడిచే ఎస్1 ప్రో+ (5.2 కిలోవాట్-గంటలు) వాహనాల సరఫరాను తమిళనాడు, కేరళ, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరిస్తున్నట్లు ఇవాళ ప్రకటించింది. ఈ క్రమంలో, కోయంబత్తూరు, కొచ్చి హైదరాబాద్ నగరాల్లో డెలివరీలను ఇవాళ ప్రారంభించగా, బెంగళూరులో ఇప్పటికే కొనసాగుతున్న సరఫరా విస్తరణను మరింత వేగవంతం చేస్తున్నట్లు నిశాంత్, ఓలా, ఎఎస్ఎమ్, ఎఎస్ రాయి నగర్ హైదరాబాద్ షోరూంలో వినియోగ దారులకు వాహనాలు అందించే సందర్భంగా అన్నారు.

ఎస్1 ప్రో+ (5.2 కిలోవాట్-గంటలు) మోడల్, సంస్థ దేశీయంగా తయారు చేసిన 4680 భారత్ సెల్ బ్యాటరీ ప్యాక్‌తో నడిచే తొలి వాహనంగా నిలుస్తోంది. ఇది అధిక పరిధి, మెరుగైన పనితీరు మరియు అధిక భద్రతను అందిస్తోంది.

వాహనాల్లో స్వయంగా తయారు చేసిన 4680 భారత్ సెల్ బ్యాటరీ ప్యాక్‌లను వినియోగించడం ద్వారా, సెల్ తయారీ నుంచి బ్యాటరీ ప్యాక్ నిర్మాణం వరకు మొత్తం ప్రక్రియను సంస్థలోనే నిర్వహిస్తున్న భారతదేశంలోని తొలి సంస్థగా ఓలా ఎలక్ట్రిక్ నిలిచింది. ఇది దేశంలో పూర్తిగా ఏకీకృత విద్యుత్ వాహన వ్యవస్థ నిర్మాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావించబడుతోంది.

వాహనాల్లో ఉపయోగించే 4680 భారత్ బ్యాటరీ సెల్‌లు బ్యాటరీ ప్యాక్‌లను పూర్తిగా సంస్థలోనే తయారు చేయడం ద్వారా, భారత్‌లో సంపూర్ణంగా ఏకీకృత విద్యుత్ వాహన వ్యవస్థను నిర్మించిన తొలి సంస్థగా ఓలా ఎలక్ట్రిక్ మరో కీలక మైలురాయిని సాధించింది.

ఈ సందర్భంగా ఓలా ఎలక్ట్రిక్ ప్రతినిధి మాట్లాడుతూ భారత్‌లోనే తయారైన, ప్రపంచ స్థాయి విద్యుత్ వాహన సాంకేతికతను పెద్ద ఎత్తున అందించాలన్న మా లక్ష్యం ఎస్1 ప్రో+కు లభిస్తున్న ఆదరణ ద్వారా స్పష్టమవుతోంది. మా స్వంత 4680 భారత్ సెల్‌తో నడిచే వాహనాలను వినియోగదారులు స్వీకరిస్తుండటంతో సరఫరా వేగంగా పెరుగుతోంది. అనేక రాష్ట్రాల్లో డెలివరీలు విస్తరించడంతో, త్వరలోనే ఈ వాహనాలను దేశవ్యాప్తంగా ప్రతి ప్రాంతానికి చేరవేయడానికి మేము సిద్ధమవుతున్నాం" అని తెలిపారు.

ఎస్1 ప్రో+ (5.2 కిలోవాట్-గంటలు) మోడల్ 13 కిలోవాట్ మోటార్‌తో పనిచేస్తూ, 0 నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 2.1 సెకన్లలో సాధిస్తుంది. ఇది ఆఎజ మోడ్‌తో కలిపి 320 కిలోమీటర్ల వరకు ప్రయాణ పరిధిని అందిస్తుంది. ఈ స్కూటర్‌లో హైపర్, స్పోర్ట్స్, నార్మల్ మరియు ఎకో అనే నాలుగు రైడింగ్ మోడ్‌లు అందుబాటులో ఉన్నాయి. భద్రత పరంగా, ముందు మరియు వెనుక డిస్క్ బ్రేక్‌లతో కూడిన ద్వంద్వ ఏబీఎస్ వ్యవస్థను కలిగి ఉంది. అదనంగా, మెరుగైన సౌలభ్యం కోసం ద్వీరంగు సీటు, శరీర రంగుకు సరిపోయే అద్దాలు, కొత్త డై-కాస్ట్ అల్యూమినియం గ్రాబ్ హ్యాండిల్, చక్రాల అలంకరణ స్టిక్కర్లు, అలాగే ప్యాషన్ రెడ్, పోర్సిలెన్ వైట్, ఇండస్ట్రియల్ సిల్వర్, జెట్ బ్లాక్, స్టెల్లర్ బ్లూ మిడ్‌నైట్ బ్లూ వంటి విస్తృత రంగుల ఎంపికలు అందుబాటులో ఉన్నాయి.

# తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసిన దిలీప్ తాళ్లూరి

**– ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ తరపున పోటీ**




ఖమ్మం లీగల్, డిసెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి) :ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ (ఎఫ్.ఎల్.పి) తరపున తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న దిలీప్ తాళ్లూరి సోమవారం హైకోర్టు ప్రాంగణంలోని తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యాలయంలో తన నామినేషన్‌ను అధికారికంగా దాఖలు చేశారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాదులు, యువ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు సంఘీభావం తెలుపుతూ తమ మద్దతును ప్రకటించారు. నామినేషన్ దాఖలు అనంతరం జరిగిన సమావేశంలో దిలీప్ తాళ్లూరి మాట్లాడుతూ... న్యాయ వాదుల సంక్షేమం, వృత్తి భద్రత, గౌరవ పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సిఆర్పీ సీ సెక్షన్ 41ఏ, బిఎన్ఎన్ఎస్ సెక్షన్ 35(3) వంటి కీలక అంశాలపై అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయిలో తాను చేసిన కృషిని గుర్తు చేస్తూ, న్యాయవాదులు అనవసర వేధింపులకు గురి కాకుండా చట్టపరమైన బలమైన రక్షణ అవసరమని అన్నారు. అదేవిధంగా న్యాయవాదులకు సమగ్ర ఆరోగ్య బీమా, సామాజిక భద్రతా పథకాలు, కుటుంబాలకు భరోసా కల్పించే సంక్షేమ చర్యలు అమలు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవా దులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, వాటిని అరికట్టేందుకు కఠినమైన ప్రత్యేక చట్టం తీసుకురావడానికి తాను నిరంతరం పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. బార్ కౌన్సిల్ వేదికగా న్యాయవాదుల సమస్య లపై బలమైన స్వరం వినిపిస్తూ, పారదర్శకతతో కూడిన కార్యాచరణ చేపడతానని దిలీప్ తాళ్లూరి తెలిపారు. న్యాయవాదుల ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ సాధ్యమని పేర్కొంటూ, బార్ కౌన్సిల్‌ను మరింత క్రియాశీలకమైన, స్పంద నాత్మక సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కరాటే నుంచి కరుణ వరకు ఖమ్మం వాసుల సేవాభావానికి గౌరవం

ఖమ్మం, డిసెంబర్ 29 (నేటనిజం ప్రతినిధి) :ఖమ్మం జిల్లా వాసుల సేవాభావానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది, సామాజిక సేవ, విద్య, సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేస్తున్న పలువురు ప్రముఖులకు ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ఖమ్మం జిల్లాకు మరింత ప్రతిష్ఠ తీసుకొచ్చే విధంగా నిర్వహించారు. ఖమ్మం పట్టణం రమణగుట్ట ఏరియాకు చెందిన కరాటే వేణు కరాటే రంగంలో చేసిన విశేష సేవలతో పాటు, సమాజ సేవలో చూపిన అంకితభావానికిగాను సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. యువతకు కరాటే శిక్షణ ఇస్తూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన, మరోవైపు ఖమ్మం జిల్లాలోని అనాధ పిల్లల కు అన్నదానం, బట్టల పంపిణీ, పేదలకు ఆర్థిక సహాయం, అవ సర సమయంలో అండగా నిలబ డటం వంటి ఎన్నో సేవా కార్యక్ర మాలు నిరంతరం నిర్వహిస్తున్నా రు. ఆయన చేసిన ఈ మానవతా సేవలను గుర్తించిన ఉషోదయ ఫౌండేషన్ వారు కరాటే వేణును సేవారత్న అవార్డుతో సత్కరించారు. అలాగే ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన నలబోలు ప్రవీణ్ కుమార్ రెడ్డి కూడా పేదల పట్ల అపారమైన మానవతాభావంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అనాధ పిల్లలకు బట్ట లు పంపిణీ చేయడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చడం, అనాధ శరణాలయాలకు సహకా రం అందించడం, చిన్న పిల్లల సంక్షేమానికి తోడ్పాటు అందిం చడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి మానవ సేవే మాధవ సేవ అన్న భావనను ఆచరణలో చూపిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఉషోదయ ఫౌండేషన్ వారు నలబోలు ప్రవీణ్ కుమార్ రెడ్డిని కూడా సేవారత్న అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు, అవార్డు గ్రహీతలు భారీ సంఖ్యలో హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఉషోదయ ఫౌండేషన్ నిర్వా హకు లు మాట్లాడుతూ...సమాజ హితానికి అంకితమై సేవలంది స్తున్న వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ అవార్డులు అందజే స్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి ఇలాంటి సేవాభావం తో ముందుకు వస్తు న్న వ్యక్తులు యువతకు ఆదర్శంగా నిలుస్తు న్నారని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com